
- ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ యార్డులు
- కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- రిజర్వేషన్ల ఖరారుకు ఉత్తర్వులు జారీ
- ఇప్పటికే కలెక్టర్లకు నివేదిక అందజేసిన అధికారులు
- కూటమి పార్టీల్లో పదవుల పందేరం షురూ

కొత్త పాలకవర్గాల ఎంపికకు కసరత్తు



కర్నూలు మార్కెట్ యార్డు

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో మార్కెట్ యార్డుల నూతన పాలక వర్గాల ఎంపికకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చైర్మన్, వైస్ చైర్మన్లు సహా డైరెక్టర్లను నామినేట్ చేయనున్నారు. త్వరలోనే నూతన పాలక వర్గాలు కొలువుదీరనున్నాయి. ఈ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ అధికారులు జిల్లాలో ఎన్ని మార్కెట్ కమిటీలు ఉన్నాయి.. 2022 ఆగస్టులో ఏ యార్డు ఏ కేటగిరికి రిజర్వేషన్ చేశారు.. తదితర వివరాలతో కలెక్టర్లకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. 11, 12 తేదీల్లో సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీల సమీక్ష నిర్వహించి ఆ తరువాత రిజర్వేషన్ల ప్రక్రియ మొదలు పెడతారని సమాచారం. దీంతో టీడీపీ కూటమి పార్టీల్లో నామినేటెడ్ పదవుల పందేరం షురూ అయింది. ఆశావహులు ఇప్పటికే రాష్ట్ర పెద్దలు, ఎమ్మెల్యేలను కలిసి ప్రయత్నాలు పదవుల కోసం చేస్తున్నారు.



నంద్యాల మార్కెట్ యార్డు

కర్నూలు జిల్లాలో ఏడు, నంద్యాల జిల్లాలో ఎనిమిది కలిపి ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల్లో రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరిగితే.. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్‌లు అలంకారప్రాయంగా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల మార్కెట్లలో రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరిగితే మిగిలిన మార్కెట్ యార్డులు వారాంతపు మార్కెట్లుగా మారితే.. కొన్ని పేరుకే అన్నట్టుగా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ల పరిధిలో ఏటా రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ సెస్సు రూ.36 కోట్ల వస్తుంది. నంద్యాల జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డుల పరిధిలో ఏడాదికి రూ.2,600 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా రూ.26 కోట్ల ఆదాయం వస్తోంది.

రిజర్వేషన్లు ఖరారు చేయండి

ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల నియమాకాల్లో ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మిగిలిన పదవులు ఓపన్ కేటగిరి (ఓసీ)లో భర్తీ చేయాల్సి ఉంటుంది. మొత్తం స్థానాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ప్రతి మార్కెట్ కమిటీలో వ్యవసాయ / ఉద్యానవన శాఖ, కో-ఆపరేటివ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, పంచాయతీ / మున్సిపాలిటీల నుంచి నలుగురు ప్రభుత్వ అధికారులు, ముగ్గురు ట్రేడర్స్, 13 మంది రైతులు కలిపి 20 మంది డైరెక్టర్లు ఉంటారు. రైతుల నుంచి ఎంపికైన డైరెక్టర్ల నుంచే చైర్మన్, వైస్ చైర్మన్లను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉంటారు. రైతుల నుంచి ఎంపిక చేసే డైరెక్టర్లు, చైర్మన్ పోస్టులను ఏ కేటగిరికి రిజర్వేషన్ కల్పిస్తారో.. ఆ కేటగిరి నుంచే ఎంపిక చేయాల్సి ఉంటుంది. అలాగే రైతుల కోటా డైరెక్టర్లుగా ఎంపిక అవ్వాలంటే ఆ మార్కెట్ పరిధిలో సొంతంగా సాగు భూమి ఉండాలి. పాడిపరిశ్రమ రైతులు కూడా అర్హులే అయినప్పటికీ పశుసంవర్ధక శాఖ జేడీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ట్రేడర్స్ కోటా ఎంపికయ్యే డైరెక్టర్లు ఆ మార్కెట్‌లో ట్రేడింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

రాజకీయ జోక్యం ఉంటుందా..!

మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్ రిజర్వేషన్లు రొటేషన్ పద్ధతిలో ఖరారు చేస్తారా.. ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ఎంపిక చేస్తారా.. అన్నది చర్చగా మారింది. ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు వంటి కీలక మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలు తమకు అనుకూలమైన వ్యక్తులకే కట్టబెట్టేలా రిజర్వేషన్ల ఖరారు కోసం జిల్లా కలెక్టర్లపై రాజకీయ ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే రూ.కోట్ల ఆదాయం కలిగిన కీలక మార్కెట్ చైర్మన్ పీఠాలు బలమైన సామాజిక వర్గాలకు వెళ్తాయని, ప్రాధాన్యత లేని మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలు రిజర్వేషన్ కోటాలో ఎస్టీ, ఎస్సీ, బీసీలకు కేటాయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని రొటేషన్ పద్ధతిలో ఖరారు చేస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మిగతా 6లో..

అగ్ని ప్రమాదం వల్లే బాలిక మృతి

- టిన్నర్, మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయి
- నందికొట్కూరు ఘటనపై వివరాలు వెల్లడించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, డీఎస్పీ రామాంజి నాయక్

నందికొట్కూరురూరల్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో బాలిక మృతిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, అయితే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో బాలిక మృతి చెందిందని పోలీసులు చెప్పారు. నందికొట్కూరు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అన్ని కోణాల్లో విచారించామని చెప్పారు. అమ్మాయి గదిలో ఉన్న పెయింట్‌లో కలిపే టిన్నర్ డబ్బా తెరిచి ఉండడం, అలాగే వెలుగుతున్న మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయని చెప్పారు. దీంతో బాలిక మంటల్లో కాలిపోయిందని చెప్పారు. బాలిక తాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రెండేళ్లుగా నందికొట్కూరులో తాత ఇంటి వద్ద ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోందని తెలిపారు. మూడేళ్ల క్రితం వెల్దుర్తి మండలంలో పదో తరగతి చదువుతున్నప్పటి నుంచి బాలిక, రాఘవేంద్ర అనే యువకుడు ప్రేమించుకుంటున్నారని చెప్పారు. ఈ సాన్నిహిత్యంతోనే గత ఆదివారం రాత్రి నందికొట్కూరులో బాలిక తాతగారి ఇంట్లో బాలికతో పాటు యువకుడు ఉన్నారని తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని నిర్ధారించామని చెప్పారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని చెప్పారు. నందికొట్కూరు సీఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.

ముహూర్తం ఖరారు

6

నల్లమల అందాల నడుమ భైరవ క్షేత్రం

- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి ఆలయం
- పర్యాటకులను కనువిందు చేస్తున్న తెలుగుగంగ జలాశయం

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం 08518-277305 ను ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైతే వరి, పొగాకు పంటలు సాగు చేసిన రైతులు పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం



మొబైల్ ఎగ్జిబిషన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మస్తానయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ సమాజ నిర్మాణంలో జన్యుశాస్త్రం పాత్ర ప్రత్యేకమైనదని, ఈ విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని విద్యాశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు వీఎన్ మస్తానయ్య తెలిపారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మొబైల్ ఎగ్జిబిషన్ వాహనం కర్నూలుకు చేరుకుంది. డీఈవో కార్యాలయం ఆవరణంలో డీఈవో శ్యామ్యూల్ పాల్‌తో కలిసి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ మొబైల్ వాహనంలో జన్యుల నిర్మాణం, జన్యుల సమస్యలు రుగ్మతలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసే స్లైడ్‌లను ఈ సంచార వాహనంలో ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు జన్యుశాస్త్రంపై అవగాహన పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో పర్యటిస్తుందని, పాఠశాలల విద్యార్థులు వినియోగించుకోవచ్చని డీఈవో తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందంజలో విద్యార్థులను నిలబెట్టడం తమ కర్తవ్యమని వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ నాగభూషణం, శ్రీనివాసులు, రవికుమార్ పాల్గొన్నారు.

సంకల్పం సిద్ధించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ప్రభుత్వ కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రణాళిక రూపొందించిన ఇంటర్మీడియట్ విద్యామండలి
- డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కార్యాచరణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యాభై శాతం మంది విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. దీంతో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇంటర్ విద్యా మండలి 'సంకల్ప్' పేరుతో డిసెంబరు నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు ప్రణాళికను రూపొందించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని సంకల్ప్ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు వారికి తర్ఫీదునిస్తారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయడమే ధ్యేయంగా సంకల్ప్ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ప్రారంభించింది.

మిగతా 6లో..

ప్రభుత్వ కళాశాలల్లో దారుణమైన ఫలితాలు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో ఏటా దారుణమైన ఫలితాలు చోటు చేసుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, నంద్యాల జిల్లాలో 21 కళాశాలలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి దాదాపు 12,500 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్నారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అరకొరగా ఉంది. వార్షిక పరీక్షల్లో 50 శాతం మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతుండడంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడేళ్లుగా ఉత్తీర్ణులైన విద్యార్థులు, నమోదైన ఉత్తీర్ణత శాతం వివరాలు కింది విధంగా ఉన్నాయి.



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

విద్యా సంవత్సరం	పరీక్షలకు హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
1) 2021-2022 (ఉమ్మడి కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	7,042	1,386	19.68
ద్వితీయ సంవత్సరం	6,340	2,218	34.98
2) 2022-2023 (ఉమ్మడి కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	4,372	1,243	28.43
ద్వితీయ సంవత్సరం	4,787	1,941	40.54
3) 2023-2024 (కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	3,287	1,264	38.45
ద్వితీయ సంవత్సరం	2,397	1,314	54.81
4) 2023-2024 (నంద్యాల జిల్లా)			
మొదటి సంవత్సరం	1,677	764	45.55
ద్వితీయ సంవత్సరం	1,039	674	64.87

నంద్యాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న నంద్యాల ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనడంతో పాటు 48 గంటలలో రైతులకు సంబంధిత మొత్తాలను అందజేస్తామన్నారు. 65 వేల ఎకరాల్లో ఉన్న ఫ్రీ హోల్డ్ భూములపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. కేసీ కేనాల్ ఆధీనంలో ఉన్నభూముల ఆక్రమణపై కమిటీ ఏర్పాటుచేసి పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్లు, గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసి 50శాతం పనులు పూర్తిచేశామని తెలిపారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజకుమారి జిల్లా అభివృద్ధికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, పాణ్యం, నందికొట్కూరు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'రబీలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోండి'

రబీ సీజన్‌లో సాగునీటి కాలువల కింద ఉన్న రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా అభివృద్ధి సమావేశం అనంతరం జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. పయ్యావుల మాట్లాడుతూ తెలుగుగంగ కింద 84వేల ఎకరాలు, ఎస్సార్బీసీ కింద లక్ష ఎకరాలు, కేసీ కెనాల్ కింద 90 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు వారబందీ పద్ధతిలో మార్చి 31వరకు సాగునీటిని ఇచ్చేందుకు నీటిని విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. శ్రీశైలం జలాశయంలో కేవలం 27 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉందని, నీటి లభ్యతను బట్టి వరి పంటకు నీటిని విడుదల చేసే వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

ఆధ్యాత్మికం


ఆలయ ప్రాంగణంలోని కోనేరు


ఈశ్వరస్వామి


చాగలమర్రి భైరవగుండాల క్షేత్రం ఏరియల్‌వ్యూ


పూజలందుకుంటున్న భైరవేశ్వరుడు

నల్లమల అందాల నడుమ భైరవ క్షేత్రం

- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి ఆలయం
- పర్యాటకులను కనువిందు చేస్తున్న తెలుగుగంగ జలాశయం

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవ గుండాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలనం నాటి భైరవీశ్వర ఆలయం ఇక్కడ ఉంది. రాచరికపు గుర్తులు ఉన్న అతిపూరాతన ఆలయం ఇది. పక్కన తెలుగుగంగ జలాశయం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మూడు కి.మీ దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవీశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఇది అత్యంత పూరాతనమైనది. ఇక్కడ ఈశ్వరుడు, భైరవీశ్వరుడు కొలువుదీరారు. కొన్ని వందల సంవత్సరాల నాటి ఆలయంగా ఇక్కడి పెద్దలు చెబుతారు. పూరాణాల ప్రకారం శ్రీకృష్ణదేవరాయలు కాశీకి వెళ్లే సమయంలో మార్గం మధ్యలో విశ్రాంతి కోసం భైరవీశ్వర ఆలయం నిర్మించారు. నీటితో నిండిన రెండు గుండాలు ఉన్నాయి. గతంలో ఈ గుండాల్లో దేవతలు స్నానం ఆచరించి పూజలు చేసేవారని పూరాణాల్లో ఉంది. కృష్ణానది ఒడ్డున ఈశ్వర ఆలయం ఉండటం ఇక్కడి ప్రత్యేకత. శివాలయం పక్కన అమ్మవారు, సీతారాముల ఆలయాలు, అక్కదేవతలు, ఆంజనేయస్వామి గుడి కొలువై ఉన్నాయి. కాశీరెడ్డినాయన భైరవగుండాలను సందర్శించడం వల్ల గ్రామస్థులు కాశీరెడ్డినాయన గుడిని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని ప్రతాపరుద్రుడు సందర్శించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. కార్తీకమాస ఉత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయం చెంతనే తెలుగుగంగ జలాశయం ఉండటంతో నీటి సౌకర్యానికి కొదువలేదు. తెలుగుగంగ జలాశయం, భైరవ క్షేత్రాలు చూడటానికి కడప, కర్నూలు తదితర జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. చాగలమర్రి మండల కేంద్రం నుంచి సుమారు 8 కి.మీ దూరంలో భైరవ క్షేత్రం ఉంది. చాగలమర్రి నుంచి చింతలచెరువు గ్రామం మీదుగా భైరవగుండాలకు వెళ్లాలి. ఈ ఆలయం చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం పచ్చదనంతో పర్యాటకులను కనువిందు చేస్తూ ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న భూమా అఖిలప్రియ భైరవగుండాల క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలోనైనా భైరవ క్షేత్రానికి వెళ్లేందుకు తారు రోడ్డు, బస్సు సౌకర్యాలు, ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కృషి చేయాలని ఆశిస్తున్నారు.


ఆలయం ముంగిట తెలుగుగంగ జలాశయం

విద్యార్థుల వివరాలు పంపండి: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లో డ్రాప్ బాక్సుల్లోని ప్రతి పిల్లల వివరాలను పరిశీలన చేసి వాటివివరాలను నమోదు చేసి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముూల్ పాల్ మంగళవారం ఆదేశిం చారు. డ్రాప్ బాక్సుల్లోని విద్యార్థుల వివరాలను సేకరించుటకు ప్రతి మండలం లోని ఒక నోడల్ అధికారిని నియమిం చామని, ఆ అధికారి తమకు కేటాయించిన మండలంలో సీఆర్‌ఎంటీ, వార్డు సెక్రటరీ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా తగు సమాచారం సేకరించడానికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికా రులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వలసలు వెళ్లిన విద్యార్థుల వివరాలను తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. ఆయా గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీతో ధ్రువీకరించాలన్నారు. గుర్తించిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబరును జనరేట్ చేయాలన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలను సేకరించి ప్రొఫార్మాలో నమోదు చేయాల న్నారు. ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని డీఈవో ఆదేశించారు.

ఆదోని మెడికల్ కాలేజీ పోస్టులు రద్దు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో జారీ చేసిన ఆదోని మెడికల్ కాలేజీ, ఆదోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పోస్టుల భర్తీని రద్దు చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ నెంబర్ 01/2023, 02/2023కు సంబంధించిన ఈ రెండు నోటిఫికేషన్ల భర్తీ రద్దు చేసినట్లు తెలిపారు. రద్దు చేయబడిన పోస్టుల వివరాలు ప్రస్తుతం భర్తీ చేస్తున్న కర్నూలు, నంద్యాలలోని మెడికల్ కాలేజీలు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, కర్నూలు గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ పోస్టుల ఖాళీలు, రోస్టర్ పాయింట్లు వివరాలు జిల్లాల వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. Https://kurnool.ap.gov.in and https://nandyal.ap.gov.in మరియు Https://kurnoolmedicalcollege.ac.in లో అభ్యర్థుల సమాచారం ఉంచినట్లు తెలిపారు.

ప్రాసిక్యూషన్ జిల్లా అడిషినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా సరళాదేవి



కర్నూల లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాసిక్యూషన్ కర్నూలు జిల్లా అడిషినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా సి.సరళాదేవిని నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలు జారీ చేశారు. ఈమె గతంలో న్యూఢిల్లీలోని గాంధీ భవన్ ఇన్‌చార్జిగా పని చేశారు. ఈ మేరకు ఈమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవితో పాటు ఆమె మొదటి అదనపు సెషన్స్ కోర్టు గ్రేడ్-1 పీపీగా కూడా బాధ్యతలు నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తన ఆదేశాల్లో పేర్కొంది. స్థానిక ఎ.క్యాంపులోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఈమెకు జిల్లాలోని పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆమెను కలిసి అభినందించారు.

మానవ హక్కులను పరిరక్షించుకుందాం

శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రతి ఒక్కరిపై ఉందని శాశ్వత లోక్ అధాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్య సమితి యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ప్రకటించిందని అన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మానవ హక్కులైన స్వేచ్ఛ, సమానత్వం, వివక్ష లేని సమాజం అవసరమని, ఈ ఏడాది 'మా హక్కులు - మన భవిష్యత్తు' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆ తర్వాత ఆయన మానవ హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డీసీపీవో శారద, ఎస్సీవో రాయపాటి శ్రీనివాస్, పలువురు పోలీసు అధికారులు, కామన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్

సంకల్పం సిద్ధించాలి

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులను గ్రేడులుగా విభజన

ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులను అధ్యాపకులు ఏ, బీ, సీ గ్రేడులుగా విభజిస్తారు. ఏ-గ్రేడులోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తారు. బీ-గ్రేడులోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా, సీ-గ్రేడులోని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడతారు. ఇందులో భాగంగా విద్యార్థులను అధ్యాపకులకు దత్తత ఇస్తారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణులయ్యేలా చేయాల్సిన గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉంది. సబ్జెక్టుల వారీగా ముఖ్యమైన అంశాలను బోధించడం, ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో డీవీఈవో, డీఐఈవో, ఆర్‌ఐవోలు కళాశాలల్లో అమలవుతున్న సంకల్ప్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఫలితాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు.



ఆళ్లగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల

అంశాల వారీగా విద్యాబోధన



విద్యార్థులకు ముఖ్యమైన అంశాల వారీగా విద్యాబోధన చేస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాం. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. అధ్యాపకుల ద్వారా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ రూపొందించి విద్యార్థులకు ఇస్తున్నాం. కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- అజయ్ కుమార్, ప్రిన్సిపాల్, ఆళ్లగడ్డ జూనియర్ కళాశాల

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సంకల్ప్ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రశ్నపత్రాలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఫలితాల ఆధారంగా మెరుగుపరచాల్సిన అంశాలను గుర్తించి విద్యార్థులకు బోధిస్తున్నాం. విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రగతిని తెలియజేస్తున్నాం.

-శ్రీనివాసులు, ప్రిన్సిపాల్, యర్రగుంట్ల జూనియర్ కళాశాల

ప్రతి కళాశాలకు క్వశ్చన్ బ్యాంకులు



సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ విద్యామండలి రూపొందించిన ప్రత్యేక క్వశ్చన్ బ్యాంకులను అందజేశాం. త్రైమాసిక పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడులుగా విభజించి అధ్యాపకులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. సబ్జెకుల వారీగా క్వశ్చన్ బ్యాంకులు అందజేసి, ప్రత్యేక తరగతుల నిర్వహణ, స్టడీ అవర్స్ ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

-సునీత, డీఐఈవో, నంద్యాల జిల్లా

కేర్ టేకర్లుగా అధ్యాపకులు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులను అధ్యాపకులకు దత్తత ఇస్తాం. వారు కేర్ టేకర్లుగా వ్యవహరిస్తూ ప్రతి విద్యార్థిపై శ్రద్ధవహిస్తారు. విద్యార్థులను ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా చేసి వారి అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన ఫలితాలు సాధించేందుకు సబ్జెక్టుల వారీగా ముఖ్యమైన అంశాలను బోధించేలా ప్రణాళిక అందజేశాం. ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నాం.

-పరమేశ్వరరెడ్డి, డీవీఈవో, కర్నూలు జిల్లా

కొత్త పాలకవర్గాల ఎంపికకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

కూటమి పార్టీల్లో పదవుల పందేరం

మార్కెట్ యార్డు కమిటీల నూతన పాలకవర్గాల ఎంపిక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేలు, రాష్ట్ర పెద్దల ఆశీస్సుల కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టారు. గత ఎన్నికల ముందు టీడీపీ కూటమి పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం అధికారంలోకి రాగానే మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఇస్తామంటూ హామీలు ఇచ్చారు. తాజాగా ఆ హామీ గుర్తు చేస్తూ పదవులు ఆశిస్తున్నారు. ఆదోనిలో కూటమి భాగస్వామ్యమైన బీజేపీ ఎమ్మెల్యే గెలిచారు. మార్కెట్ చైర్మన్ పదవి టీడీపీ, జనసేన, బీజేపీలు నాయకులు ఆశిస్తున్నారు. ఇక్కడ బీజేపీ నుంచి ఎమ్మెల్యే ఉండడంతో మార్కెట్ చైర్మన్ పదవి టీడీపీ ఆశిస్తోంది. అయితే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు మధ్య రాజకీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే సిఫారసు చేసే వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తారా..? టీడీపీ ఇన్‌చార్జి సిఫారసు చేసే వ్యక్తిని చైర్మన్‌గా ఎంపిక చేస్తారా అన్న రాజకీయ చర్చ నడుస్తోంది. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా రూ.16 కోట్లకు పైగా ఆదాయం కలిగిన మార్కెట్ ఇది. కర్నూలు మార్కెట్ యార్డు కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజవర్గాల పరిధిలోకి వస్తుంది. ఏ ఎమ్మెల్యే సిఫారసు చేసే వ్యక్తిని చైర్మన్‌గా ఎంపిక చేస్తారన్నది ప్రశ్నగా మారింది. ఏటా రూ.7 కోట్లకు పైగా ఆదాయం ఉంది. ఎమ్మిగనూరు, పత్తికొండ, నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలు దక్కించుకోవడానికి మూడు పార్టీల్లోని ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

2022 ఆగస్టులో మార్కెట్ కమిటీ చైర్మన్ల రిజర్వేషన్ల వివరాలు

మార్కెట్ కమిటీ	రిజర్వేషన్
కర్నూలు	ఓసీ జనరల్
ఆదోని	ఓసీ జనరల్
ఎమ్మిగనూరు	ఓసీ మహిళ
మంత్రాలయం (కోసిగి)	బీసీ/మైనార్టీ మహిళ
కోడుమూరు	ఎస్సీ/ఎస్టీ జనరల్
పత్తికొండ	బీసీ జనరల్
ఆలూరు	ఓసీ జనరల్
నంద్యాల	ఓసీ జనరల్
ఆళ్లగడ్డ	ఓసీ జనరల్
డోన్	ఓసీ జనరల్
ఆత్మకూరు	బీసీ జనరల్
నందికొట్కూరు	ఓసీ మహిళ
బనగానపల్లె	ఓసీ మహిళ
కోవేలకుంట్ల	బీసీ మహిళ
పాణ్యం	ఎస్సీ మహిళ

సన్నాహాలు చేస్తున్నాం

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 ఆగస్టులో ఉమ్మడి జిల్లాలో వివిధ మార్కెట్ యార్డు కమిటీలకు నామినేటెడ్ పద్ధతిన అప్పటి ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈ ఏడాది జూన్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆ పాలకవర్గాలను రద్దు చేసింది. తాజాగా నూతన పాలకవర్గాల నియామకంలో భాగంగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్లకు పూర్తి వివరాలతో నివేదిక ఇచ్చాం. రిజర్వేషన్లు ఖరారు చేయగానే ప్రభుత్వానికి పంపుతాం.

- నారాయణ, ఏడీ, మార్కెటింగ్ శాఖ, కర్నూలు

ఆయా చైర్మన్ పదవులు కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలు

కేటగిరి	కర్నూలు	నంద్యాల	మొత్తం	మహిళలు
ఎస్సీ/ఎస్టీ	1	1	2	1
బీసీ	2	2	4	2
ఓసీ	4	5	9	4-5
మొత్తం	7	8	15	7-8

ఆయా జిల్లాల్లో డైరెక్టర్ల పదవులు కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలు

కేటగిరి	కర్నూలు	నంద్యాల	మొత్తం	మహిళలు
ఎస్టీ	5	6	11	6
ఎస్సీ	14	16	30	15
బీసీ	26	30	56	28
ఓసీ	46	52	98	49
మొత్తం	91	104	195	98


ఆదోని మార్కెట్ యార్డు

ముహూర్తం ఖరారు

- నేడు సాగు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలో 384 సంఘాల్లో 3,692 టీసీ సభ్యుల స్థానాలకు ఎన్నిక
- ఏర్పాట్లు చేస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడింది. అసెంబ్లీ సమావేశాలు, ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా ఇప్పటికే రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయి. 14న నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర జలవనరలు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 3న వెల్లడించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కరసత్తు మొదలు పెట్టిం ది. 14న జరిగే ఈ ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం జారీ చేయనున్నట్లు కలెక్టరు పి.రంజిత్ బాషా మంగళవారం ఆంధ్రజ్యోతికి వివరించారు. కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాల పరిధిలో 1,212 ప్రాదేశిక నియోజకరవ్గం (టీసీ) సభ్యులు, నంద్యాల జిల్లాలో 262 సంఘాల పరిధిలో 2,480 టీసీ సభ్యులు ఎన్నుకోనున్నారు. ఓటర్లుగా కర్నూలు జిల్లాలో 1,32,112 మంది రైతులు, నంద్యాల జిల్లాలో 3,09,246 మంది రైతులను గుర్తించి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. టీసీ సభ్యుల ఎంపిక పూర్తి కాగానే సాయంత్రం సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే అవకాశం ఉంది. ఏ కారణాల వల్లనో ఆ రోజు ఎన్నికలు జరక గపోతే మరుసటి రోజు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే 17వ తేదీన కర్నూలు జిల్లాలో 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, నంద్యాల జిల్లాలో 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అలాగే కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో నాలుగు ప్రాజెక్టు కమిటీల ను ఈ నెల 20న ఎన్నుకునే అవకాశం ఉంది. అయితే.. ప్రాజెక్టు కమిటీ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని అధికారులు తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించేందుకు కలెక్టరు పి.రం జిత్‌బాషా పర్యవేక్షణలో ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణలు ఇచ్చారు. జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశారు. ఆయా మండలాలకు సామగ్రి పంపించారు.


నీటి సంఘాల ఎన్నికలకు సామగ్రిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

డిగ్రీ మూడో సెమిస్టర్‌లో ఆరుగురు డిబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 3వ సెమిస్టర్లో 6 గురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. 7,650 మంది దరఖాస్తు చేసుకోగా 6,892 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ తీరును డోన్‌లోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- ఏడుగురికి గాయాలు

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో చిన్న నారాయణ, చిన్న మల్లికార్జున, ఈశ్వరమ్మ, రంగమ్మ, రామాంజులు, కేశమ్మ, మద్దిలేటికి గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజి గాయాలపాలైన ఉపాధి కూలీలను పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం మదనంతపురం గ్రామంలోని ఉపాధి కూలీలు లింగాల వాగు వంకలో దాదాపు 160 మంది ప్రతిరోజు పనులకు వెళ్తున్నారు. అందులో భాగంగా వంకలోని కంప చెట్ల వద్ద పని చేస్తుండగా.. ఒక్కసారిగా తేనేటీగలు చుట్టుముట్టడంతో కొంత మంది ఉపాధి కూలీలు పరుగులు తీయగా.. మరి కొంత మంది దాకు న్నారు. అయితే.. ఏడు మందికి తేనేటీగలు దాడి చేశాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను టీడీపీ నాయకులు శ్రీనివాసులు, దేవేంద్ర, రంగప్ప, రామాంజులు, గోవిందు పరామర్శించారు.

కారు, లారీ ఢీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై మంగళవారం ఉదయం కారు, లారీ ఢీకొన్న ఘనటలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాల నుంచి కర్నూలు వెళ్తున్న కారు కాల్వబుగ్గ గ్రామ కొమ్ముచెరువు వెళ్లే యూటర్న్ వద్ద పొట్టు లారీ అతి వేగంగా తిప్పడంతో లారీని కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న బషీర్ అహ్మద్, ముస్తీర్, అబ్దుల్ ఖాదర్, మనోహర్, వెంకటేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యాభివృద్ధిలో తానా సేవలు అభినందనీయం

- టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి



స్కూల్ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న రవి పొట్లూరి, చిత్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి తదితరులు

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో తానా ఫౌండేషన్ సేవలు అభినంద నీయమని టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లల కోసం ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి మండల ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాలకు తానా (ఎన్ఆర్ఐ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమానికి గౌరు వెంకటరెడ్డితో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల జగదీశ్వరరెడ్డి, తానా ఎన్ఆర్ఐ సభ్యుడు పొట్లూరి రవి, వ్యాపారవేత్త ముప్పా రాజశేఖర్, మధు, తేజా నిషా హాజరయ్యారు. ముందుగా వీరికి పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారు విజయభారతి, పొదుపు మహిళలు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రముఖులు పాఠశాలను సందర్శించిన అనంతరం విరాళం చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లగా బాలభారతి పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని పిల్లలకు తానా (ఎన్ఆర్ఐ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు కూడా బాగా చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యేసేపు, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

- 13న అన్నదాతలతో కలిసి కర్నూలులో భారీ ర్యాలీ
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో మంగళవారం నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, ఉచిత పంటల బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 13న శ్రీకృష్ణదేవరాలయ ధర్నా చౌక్ నుంచి భారీ సంఖ్యలో రైతులను సమీకరించి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు విక్రమసింహా రెడ్డి, జుబేర్ అహ్మద్, సోంపల్లి కృష్ణకాంత్‌రెడ్డి, ఎస్‌టీ.షేక్ అహ్మద్, యూనుస్‌బాషా, గ్రంథాలయ మాజీ చైర్మన్ సుభాష్ చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను విస్మరించిన ప్రభుత్వం



పోస్టరును విడుదల చేస్తున్న కాటసాని

- 13న నంద్యాలలో ర్యాలీని జయప్రదం చేయాలి
- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని రైతులతో ఓట్లు వేయించుకుని వారిని పూర్తిగా విస్మరించిందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం కర్నూలు నగరంలోని చెన్నమ్మకూడలిలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతలు వివక్షకు గురవుతున్నా రని, రైతన్నలకు తోడుగా నిలిచి వారి సమస్యల పై వైసీపీ ప్రశ్నిస్తుం దన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13న రైతుల కోసం.. రైతులతో కలిసి నంద్యాలలోని ఉదయా నంద హోటల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అంద జేస్తామని చెప్పారు. రూ.20వేల పెట్టుబడి సాయం ఇచ్చే దాకా రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. అకాల వర్షాలతో తడిచి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదని అసహనం వ్యక్తం చేశారు. గాజుల శ్వేతారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, బెల్లం మహేశ్వరరెడ్డి, సాని శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, భీమేశ్వరరెడ్డి, సాహూరు వీరయ్య పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు

కర్నూలు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వంశీనాథ్, బాలు, హనుమంతులను అరెస్టు చేసి డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. మంగళ వారం సాయంత్రం డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ మధుసూదన్‌గౌడు, ఎస్ఐలు గోపినాథ్, చంద్రశేఖర్ రెడ్డిలు నిందితుల వివరాలు వెల్లడించారు. నిందితుడు హనుమంతుది కర్ణాటక రాష్ట్రం. ఈయన పైన కర్ణాటక రాష్ట్రంలో పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయి. ముగ్గురు నిందితులు జల్సాలు, వ్యభిచారానికి అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడని పోలీసులు గుర్తించారు. తాళాలు వేసుకున్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 28 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

మురుగు కాలువలో మృత శిశువు



మహిళలను విచారిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని మృత శిశివు కనిపించింది. పట్టణంలోని గడ్డ వీధిలో ఈఘటన చోటు చేసుకుంది. మురుగు కాల్వలో అప్పుడే పుట్టిన మగశిశువును స్థానికులు గుర్తించారు. శిశువును వెలికి తీయగా అప్పటికే మృత్యువాత పడింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ అధికారులు స్థానిక మహిళలను పూర్తి స్థాయిలో విచారించారు. విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

మహానంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలో నంది పల్లె గ్రామం వద్ద రైలు పట్టాలపై మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. యువకుడు తెలుపు, పసుపు రంగు టీ షర్టు, ఇటుక రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. యువకుడి వయస్సు 25నుంచి 30 సంవత్సరాల్లోపు ఉంటుంది. కుడి చేతికి వాచ్, ఎడమ చేతికి రబ్బర్ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. తెలిపారు.

సినిమా తెచ్చిన తంట

వెలుగోడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో పుష్ప-2 సినిమా తెచ్చిన తంట ఇరువర్గాలపై కేసుకు కారణమైంది. సినిమా బెనిఫిట్ షోను పురస్కరించుకుని సాబీర్ అనే యువకుడు పేపర్లు చల్లుతుండగా ఓ వర్గానికి చెందిన యువకులు అతనిపై దాడి చేశారు. ఈ సమస్య చిలికిచిలికి పెద్దగా మారి ఘర్షణకు దారి తీసింది. ఒక వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మరోవర్గం దాడిలో ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ విషయంపై ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ విష్ణునారాయణ దర్యాప్తు చేపట్టారు. అయితే ఓ వర్గం వారు తాము ఫిర్యాదు చేసిన వారిపై కేసును నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలంటూ స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో ఎస్ఐ వారికి నచ్చజెప్పి కేసు నమోదు చేసిన కాపీని అందజేశారు

నేడు కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

- స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై చర్చించే అవకాశం
- అమరావతికి బయలుదేరిన కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అభివృద్ధి, సంక్షేమం సహా ఏపీ విజన్-2047పై ప్రధానంగా చర్చించే అవకావం ఉంది. జిల్లాలో వివిధ శాఖల వారిగా అభివృద్ధి, చేపట్టాల్సిన ప్రగతి పనులు, గ్రామం, మండల, జిల్లా స్థాయిల్లో వివిధ వర్గాల ద్వారా సేకరించిన అభిప్రాయాల మేరకు విజన్-2047 నివేదికలతో కలెక్టరు పి.రంజిత్‌బాషా మంగళవారం అమరావతికి బయలుదేరారు. జిల్లాలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీరు, కరువు నివారణ పథకాలు, పరిశ్రమల ఏర్పాటు, గ్రామీణ, పట్టణ రహదారులు ప్రగతి.. ఇలా వివిధ శాఖలలో చేపట్టాల్సిన ప్రగతి పనులు, జిల్లాలో జరుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, సాధించిన విజయాలపై నివేదకలు సిద్ధం చేశామని, జిల్లా ప్రగతికి చేపట్టాల్సిప పనులు, తీసుకోవాల్సిన చర్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని కలెక్టరు రంజిత్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు. 11, 12వ తేదిల్లో రెండు రోజులు నిర్వహించే ఈ సమీక్ష సమావేశంలో ఏ రోజు ఏ శాఖలపై సమీక్ష నిర్వహిస్తారో అజెండా తయారు చేశారు. ముఖ్యంగా జీవో పవర్టీ - పీ4 పాలసీ, స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోకస్ పెట్టారు. వాటిపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉందని తెలుస్తుంది.

స్థూల ఉత్పత్తి విలువలో 14వ స్థానంలో కర్నూలు

కలెక్టర్ల సమీక్ష సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల్లో ప్రగతి, సంక్షేమం, స్థూల ఉత్పత్తి విలువ, ఆయా రంగాల్లో సాధించిన ప్రగతి విజన్-2047, పేదరికం లేని ఏపీ (జీరో పావర్టీ-పీ4 పాలసీ) తదితర అంశాలపై నివేదిక విడుదల చేశారు. వ్యవసాయం, పరిశ్రలు, సేవల రంగాల్లో స్థూల విలువ (జీవీఏ)లో జిల్లా 14వ స్థానంలో ఉంది. 2022-23లో స్థూల విలువ (జీవీఏ) వ్యవసాయం (అనుబంధ రంగాలు కాకుండా) రంగంలో రూ.17,447 కోట్లు (4.08 శాతం), పారిశ్రామిక రంగంలో రూ.9,978 కోట్లు (3.17 శాతం), సేవలు రంగంలో రూ.17,180 కోట్లు (3.57 శాతం) కలిపి మూడు రంగాల్లో రూ.44,604 కోట్లు (3.65 శాతం) స్థూల ఉత్పత్తి విలువ సాధించి 14 స్థానంలో జిల్లా ఉందని గణాంకాలు ద్వారా తెలుస్తోంది. అలాగే దేశీయ స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 2022-23లో రూ.47,514 కోట్లు ఉంటే 2028-29 నాటికి రూ.1,07,7862 కోట్లకు చేరుకోవాలని లక్ష్యాలను నిర్దేశించారు. ఉద్యాన పంటల సాగు లక్ష్యాలను 47 శాతం సాధించి 5వ స్థానంలో నిలిచింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో లేబర్ బడ్జెట్ ఈ నెల 9 నాటికి 59.15 లక్షల పని దినాలు వినియోగించుకొని 60.98 శాతంతో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉంటే.. 2025 మార్చి 31 నాటికి 97 లక్షల పని దినాలను వినియోగించుకోవాలని టార్గెట్ పెట్టారు. సీసీ రోడ్లు 884 మంజూరు చేస్తే 790 రోడ్ల పనులు మొదలు పెట్టి 89.37 శాతంతో రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచింది. ఇలా వివిధ శాఖల్లో సాధించిన ప్రగతి, లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం నివేదిక తయారు చేసింది. ఆ నివేదిక అంశాలతో పాటు కలెక్టర్లు తయారు చేసిన జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమం అంశాలపై సమగ్రంగా చర్చించే అకాశం ఉంది.

జిల్లా అభివృద్ధి నివేదికతో వెళ్తున్నా



సీఎం చంద్రబాబు నేడు అమరావతిలో నిర్వహించే జిల్లా కలెక్టర్ల సమీక్షకు జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చేపట్టాల్సిన పనులు, ఇప్పటికే సాధించిన ప్రగతి నివేదిక సిద్ధం చేశాం. ముఖ్యంగా జిల్లాలో కరువు, వలసల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై ప్రధానంగా చర్చి స్తాను. జిల్లాలో కరువు పూర్తిగా నివారించాలంటే అసం పూర్తి సాగునీటి ప్రాజెక్టులు, స్వయం ఉపాధి పథకాలు, పరిశ్రమలు కావాల్సి ఉంది. జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన పనులపై కూడా చర్చిస్తాను. ఇలా అన్ని శాఖలపై జిల్లాలో చేపట్టాల్సి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంగా సమీక్ష సమావేశం సద్వినియోగం చేసుకుంటాను. - **రంజిత్‌బాషా, కలెక్టరు, కర్నూలు**

ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్రుడులపై ఓ వ్యక్తి సోమవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కడప జిల్లా పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన రామకృష్ణ, అతని భార్య విషయంలో ఇటీవల పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. దీన్ని మనస్సులో ఉంచుకున్న రామకృష్ణ కోటకందు కూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్రుడులపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు.

వైసీపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

సంజామల, డిసెంబరు 10: అవుకు మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన అయ్యపురెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారు. మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగారు. దీంతో ఆయనను నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

సంజామల, అవుకు మండలాల సరిహద్దు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని చెప్పి సోమవారం రాత్రి సంజామల ఎస్ఐ తనను స్టేషన్‌కు రావాలని చెప్పి దాడి చేశారని, అలాగే కారును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారని అయ్యపురెడ్డి చెప్పారు. ఎస్ఐ రమణయ్యను వివరణ కోరగా దాడి చేయలేదని చెప్పారు. ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



సుబ్బరాయుడు

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలం లోని పెద్దకొప్పెర్ల గ్రామా నికి చెందిన కౌలు రైతు తలారి బాలసుబ్బ రాయుడు (58) మంగళ వారం అప్పుల బాధ తాళలేక ఆత్మ హత్య చేసుకు న్నారు. బాలసుబ్బరాయుడు నాలుగేళ్లగా తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప, శనగ తదితర పంటలు సాగుచేసేవారు. ఈపంటలు సాగు చేసేందుకు పెట్టుబడి కోసం తెలిసినవారి వద్ద సుమారు రూ.10 లక్షలకు వరకు అప్పు చేశారు. అయితే గత రెండేళ్లుగా మిరప పంట పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. దీంతో అప్పు ఎలా తీర్చాలో నన్న మనస్తాపంతో సుబ్బరాయుడు ఇంట్లో ఎవరూ లేని సమ యంలో పురుగుల మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సుబ్బరా యుడును కోవెలకుంట్ల ప్రభుత్వాపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

ఆదోని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన గోపాల్ (30)అనే యువకుడు మంగళ వారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన గోపాల్ అనే యువకుడు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసు కొని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గోపాల్ భార్య పద్మ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామస్వామి ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమ్మితం తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదని చెప్పారు.

లాభాల బంతి

● ఎకరాకు రూ.30వేల ఆదాయం
● పూల సాగుపై రైతుల ఆసక్తి



ఓర్వకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పూల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. బంతి, లిల్లి, కనకాంబరం పూలను సాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు. తక్కువ ఖర్చు చేసినా ఎక్కువ దిగుబడులు రావ డం, ఆదాయం రావ డం చూసి రైతులు పూల సాగుపై మక్కువ చూపుతు న్నారు. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల, సోమయాజులపల్లె, కొమరోలు, కాల్వ, కాల్వబుగ్గ గ్రామాల్లో పూల సాగు చేస్తున్నారు. కిలో బంతి విత్త నాలు రూ.10వేలకు కొనుగోలు చేశారు. నారు నాటిన రెండు నెలలకే పూలు చేతికందడంతో రైతుల పంట పండింది. మూడు రోజులకు ఒకసారి నీటి తడులు ఇస్తూ మరో మూడు రోజులు కోత తీస్తున్నట్లు రైతులు తెలిపారు. ఒకసారి కోత చేస్తే 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి రాగా.. కిలో రూ.10 నుంచి రూ.15లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడులు అధిక మించి ఎకరాకు రూ.30వేల ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు.

లాభాలు వస్తాయని..



ఏటా రెండెకరాలు బంతి పూలు సాగు చేస్తున్నాం. లాభాలు వస్తుండటంతో ఐదెక రాల్లో బంతి పూల సాగు చేశాం. పండుగ రోజుల్లో కేజీ రూ.30 నుంచి రూ.40లకు విక్ర యిస్తాం. వ్యాపారులు కేజీ రూ.50 నుంచి రూ.60లకు విక్రయిస్తుంటారు.

\- పుల్లారెడ్డి, రైతు

పీఎంశ్రీ పనులను వేగవంతం చేయండి

విద్యాశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు మస్తానయ్య



మాట్లాడుతున్న మస్తానయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన సివిల్ ఇంజనీరింగ్ పనులను డిసెం బరు 31 నాటికి పూర్తి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర అదనపు సంచాల కుడు వీఎన్ మస్తానయ్య అధికారులను ఆదేశించారు. మంగళ వారం డీఈవో కార్యాలయంలో పీఎంశ్రీ పథకం కింద చేపట్టిన పను లపై సివిల్ ఇంజనీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ పనులు ఏ దశల్లోనూ ఆగిపోవడానికి వీల్లేదని, ఈ పనులపై ప్రభు త్వానికి అంచనాలు ఉన్నాయని అన్నారు. బిల్లు అప్‌లో డుకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరి స్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఇంజనీర్లతో వివరాలు అడిగి ఏ దశలో సాగుతున్నాయో ఎప్పటికి పూర్తి చేస్తారో విషయాలపై ఆరా తీశారు. క్రీడా మైదానాలు, కెమిస్ట్రీ ల్యాబ్‌లు త్వరగా పూర్తి చేయా లన్నారు. ఏపీఆర్ఎస్ పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకుని పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. కాల్వబుగ్గ, పత్తికొండ, బనవాసి రెసిడెన్షియల్ పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. అన్ని పాఠశాలలకు తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా గ్రామీణ ప్రాంతాల్లో రూరల్ వాటర్ స్కీం అధికారుల తో, మున్సిపాలిటీ పరిధిలో అధికారులతో చర్చించి పనులు పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని డీఈవో శ్యామ్యూ ల్ పాల్‌ను ఆదేశించారు. ఈ సమా వేశంలో జిల్లా విద్యాశాఖ అధికారు లు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మనిషికి హక్కులు ఉంటాయి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి రాజ్యాంగంలో సమాన హక్కులు కలిగి ఉంటాయని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో మంగళవారం లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమానికి కోడు మూరు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనదేశంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు సీనియర్ న్యాయవాదులకు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నగర పాలక కమిషనర్‌పై ఆర్డీ అసహనం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక కమిషనర్‌పై మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథం అసహనం వ్యక్తం చేస్తూ లేఖ రాశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరిగిన అవి నీతిపై గత నెల అధికారుల బృందం కర్నూలులో విచారణ జరిపింద న్నారు. ఇంకా లోతుగా విచారించడానికి అందుకు సంబంధించి కొంత సమాచారం అవసరమని గత నెల 23న డీఎంఏ పంపిన ఉత్తర్వులకు ఇప్పటి వరకు ఎందుకు సమాచారం పంపలేదని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా త్వరగా సమాచారం పంపాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జగన్నాథగట్టు వద్ద నిర్మించిన టిడ్కో గృహాల సముదాయాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల కలెక్టర్ పి.రంజిత్ బాషా టిడ్కో, నగర పాలక అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో టిడ్కో సముదాయాల ఆవరణలో అంగన్‌వాడీ కేం ద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు నగర పాలక, టిడ్కో అధికారులు కలెక్టర్‌కు పంపేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేశారు.

ప్రపంచ ధ్యాన దినోత్సవ తీర్మానంపై హర్షం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని డిసెంబరు 21న జరుపుకోవాలంటూ భారత్, చైనా, రష్యా, జపాన్ తదితర దేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 193 దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించడంపై యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలు కేంద్రంగా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనుబంధ యోగా శిక్షకులు, న్యాయ నిర్ణేతలు రాష్ట్ర, జిల్లాల అసోసి యేషన్ సభ్యులతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించాలని, యోగా, ధ్యానంపై అవగాహన కల్పించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు రూరల్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యలను పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. కర్నూలు రూరల్ మండ లం పూడూరు గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో రీసర్వేతో భూముల కొలతలు తారుమారు కావడం, ఆన్‌లైన్‌లో భూములు ఎక్కువ, తక్కువ నమోదు కావడం వంటి సమస్యలు ఉంటే సదస్సులో అర్జీలు ఇవ్వా లని గ్రామస్థులకు సూచించారు. అనంతరం మ్యుటేషన్, చుక్కల భూములు, పేర్ల మార్పులు, చేర్పుల దరఖాస్తులు దాదాపు 24 దాకా వచ్చా యి. కార్యక్ర మంలో రూరల్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి హసీనా, మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కల్లూరు మండల నోడల్ అధికారి, సివిల్ సప్లయ్ డివిజనల్ మేనేజర్ నాగసుధ తెలిపారు. మంగళ వారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో తహసీల్దారు కె.ఆంజనేయులు ఆధ్వర్యంలో సర్పంచు హనుమక్క అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పర్లలో మొత్తం 66 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలి పారు. మ్యుటే షన్-47, సర్వే-18, పేరుమార్పు-1 అర్జీలు వచ్చాయి. కార్యక్ర మంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శేషన్న, టీడీపీ నాయ కుడు శేఖర్, మహానంది, రైతులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: భూ సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు మంగళవారం ఓర్వకల్లులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ భూసమస్యలపై ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్క రిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, జడ్పీటీసీ రంగనాథ గౌడు, నాయకులు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ఈవో మద్దిలేటి, వీఆర్వో సోమన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో మంగళవారం వీఆర్వో మంజీరా అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సద స్సుకు మండల ప్రత్యేక అధికారి శ్యామల, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల్లో ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చినా కూడా పరిష్కరించడం లేదని మారందొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, రైతులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామా నికి 14 గ్రామాలు పొలిమెర కలిసి ఉండటంతో రైతుల సమస్యలను పరిష్క రించడంలో ఒక వీఆర్వోతో చేత కావడం లేదన్నారు. బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామానికి మరొక వీఆర్వోను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సర్వే నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెవెన్యూ సదస్సుల్లో 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మొత్తం 1206 అర్జీలు వచ్చా యని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. మంగళ వారం ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం గంజనహల్లి గ్రామంలో 46, నందవరం మండలం సోమలగూడూరు గ్రామంలో 56, కోసిగి మండలం సాతనూరు గ్రామంలో 38, తుమ్మిగనూరు గ్రామంలో 4, మంత్రాలయం మండలం బూదూరులో 13, పెద్దకడుబూరు మండలం బప్పలదొడ్డి గ్రామంలో 6, ఆదోని మండలం హానవాలులో 26, మదిరేలో 60, హొళగుంద మండలం ఎల్లార్తిలో 13, కౌతాళం మండలం హాల్వి గ్రామంలో 58, ఎమ్మిగనూరు మండలం ఎమ్మిగనూరులో 40, సర్ధపురంలో 6, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం ఓర్వకల్లులో 52, కల్లూరు మండ లం పర్లలో 66, వెల్దుర్తి మండలం లక్ష్మీనగరంలో 32, కోడుమూరు మండలం గోరంట్లలో 46, కర్నూలు రూరల్ మండలం పూడూరు గ్రామంలో 24, గూ డూరు మండలం పెంచికలపాడులో 9, సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో 6, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం జూటూరులో 14, తుగ్గలి మండలం ముక్కెలలో 13, క్రిష్ణగిరి మండలం చిట్యాలలో 7, మద్దికెర మండలం యాదవల్లిలో 8, ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామంలో 21, చిప్పగిరి మండలం నేమకల్‌లో 21, ఆస్పరి మండలం ములుగుందంలో 12, హాలహర్వి మండలం బాపురంలో 1, పచ్చరపల్లి గ్రామంలో 1, దేవనకొండ మండలం జిల్లేడుబుడకల గ్రామంలో 10, మొత్తం 29 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 709 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఇందులో ప్రభుత్వ భూములపై ఆక్రమణ, రక్షణ 4, ఇంటి పట్టాల కోసం 5, ప్రభుత్వ భూమి కోసం 1, నిషిద్ధ భూముల జాబితా నుంచి తమ భూములు తొలగించాలనే ఫిర్యాదులు 21, రీసర్వే గ్రీవెన్స్ 9, జీఎస్ డబ్ల్యూఎస్, మీసేవా, గ్రీవెన్స్‌లో 2, ఇనామ్స్ గ్రీవెన్స్ 1, ఆర్‌వోఆర్ కేసులకు సంబంధించి 569, రెవెన్యూ అండర్ అదర్ కోర్ట్స్ 1, ఇతరాలు 96, మొత్తం కలిపి 709 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించిన 6వ తేదీ (మొదటి రోజు)270 అర్జీలు, 9వ తేదీ (రెండోరోజు) 227 అర్జీలు, 10వ తేదీ (మూడో రోజు) 709 అర్జీలు మొత్తం కలిపి ఇప్పటి వరకు 1206 అర్జీలు అధికారులు స్వీకరించామని ఆమె తెలిపారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నగర పాలక ఎస్ఈ రాజశేఖర్



ఎస్ఈతో చర్చిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంజ నీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా కార్మికులకు సమ్మె చేస్తున్నారు. మంగళవారం అశోక్‌నగర్ పంప్ హౌస్ లో ఎస్ఈని కలిసి సమ స్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం నగర పాలకకు సంబంధించి సమస్య కాకపోవ డంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇటీవల యూనియన్ నాయకులు ఇచ్చిన సమ్మె నోటీసు, డిమాండ్ల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా నీటి సరఫరా, విద్యుత్ దీపాలకు సంబంధించిన కార్మి కులు విధుల్లో కొనసాగాలని ఆయన కోరారు. అనంతరం కార్మికు లు పంప్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి జిల్లా పరిషత్, పాతబస్టాండు మీదు గా నగర పాలక కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భం గా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జి.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్. మనోహర్, కాశపోగు జ్ఞానమ్మ, జి.వెంకటేష్, జావిద్ పాల్గొన్నారు.

'సమ్మెను ఉధృతం చేస్తాం'

గూడూరు డిసెంబరు 10: సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని గూడూరు నగర పంచాయతీ ఇంజ నీరింగ్ కార్మికులు అరవింద్, ఎ.మధు, దూకేశ్వరరావు హెచ్చరిం చారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నిక ల్‌లకు వేతనం రూ.29,200, రూ.24,500 ఇవ్వాలన్నారు. అలాగే 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలి, సీనియారిటీ ప్రాతిప దికన జీతా లు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీపీఐ నాయకులు కృష్ణ, శేషు కుమార్, శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, షబ్బీర్ బాషా, హుసేన్ ఖాన్, ఖాజా హుసేన్, జయన్న, అల్లి బాషా, మధు, హరి, రజాక్ పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరి సన్నిధిలో సినీ నటి లత



సుంకులాపరమేశ్వరిని దర్శించుకుంటున్న సినీ నటి లత

గూడూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగ లాపురం గ్రామంలో వెలసిన కె నాగలాపురం సుంకులా పరమేశ్వరి అమ్మ వారిని సినీ నటి లత, ఆమె సోదరులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ నిర్మాణ దాత రాజ్‌కుమార్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్, కుటుంబ సభ్యులు అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు అమ్మవా రికి మంగ ళ హారతి పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలను అంద జేశా రు. ఆలయ సిబ్బంది కేశవ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యమాలతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం నగర శివారులోని వెంగన్నబావి వద్ద గల విజయవనంలో ప్రజాస్వామ్య సమఘాల ఐక్య వేదిక తొమ్మిదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేదిక భాగస్వామ్య సంఘాల నాయకులు హాజరై గత ఏడాది కాలంగా నిర్వహిం చిన కార్యక్రమాలపై చర్చించారు. కర్నూలు పశ్చిమ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు వ్యతి రేకంగా ప్రజలను సమీకరించి, ఉద్యమం ద్వారా కొంత మేరకు విజయం సాధించిందని అన్నారు. ముఖ్య వక్తలుగా హాజరైన జేవీవీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మ రెడ్డి, సీనియర్ న్యాయవాది మనోహర్‌లు 'ప్రస్తుత సంక్షోభ సమయంలో ఉమ్మడి ఉద్యమాల ఆవశ్యకత, ఐపీసీ చట్టాల సవరణ - వాస్తవ పరిస్థితి' అనే అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వేదిక కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, సీపీఐ నాయకుడు రామకృష్ణారెడ్డి, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

13న క్లస్టర్ వర్సిటీలో అష్టావధాన సభ

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ లో ఈనెల 13న అష్టావధాన సభ నిర్వహిస్తున్నట్లు తెలుగు శాఖ అధ్యక్షు రాలు డాక్టర్ ఫమీదా బేగం తెలిపారు. ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, ఏలూరు నుంచి అపర్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

రక్తదానం చేయండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు బ్లడ్ బ్యాంకు సెంటర్ అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ తలసేమియా చిన్నారులు తరుచూ రక్తం ఎక్కించుకోవాల్సిన అవస రం ఉందని, అలాంటి వారి కోసం అక్షయ ఫౌండేషన్ ఈకార్యక్రమాన్ని ఏర్పా టు చేయడం అభినందనీయమన్నారు. కర్నూలు బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డా.రవి కాంత్, అక్షయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మణిబాబు, నాగార్జున పాల్గొన్నారు.

సమ్మెలోకి ఇంజనీరింగ్ కార్మికులు

నీటి సరఫరాకు ఇబ్బందులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన కార్మికులు రెండు రోజు లుగా ఆందోళనబాట పట్టారు. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీ కార్మికులు ధర్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి విధులు వదులుకుని సంపూ ర్ణంగా సమ్మెకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో నగర పాలకలో కీలక భాగమైన నీటి సరఫరా, విద్యుత్ దీపాలకు సంబంధించిన కార్మికులు ఇందులో ఉన్నారు. ప్రతి రోజూ తాగునీటి సరఫరా లేకపోతే సాయంత్రం విద్యుత్ దీపాలు వెల గకపోతే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యం లో అధికారులు ప్రత్యామ్నాయంగా చర్యలుచేపడతారా లేదా వేచి చూడాలి.

విధుల్లో అత్యవసర విభాగాల కార్మికులు

అత్యవసర విభాగాలైన నీటి సరఫరా, విద్యుత్ దీపాలకు సంబంధించిన కార్మికులకు విధుల్లోనే ఉండే విధంగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రజ లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ప్రజలకు నిత్యం అనుసంధానంగా ఉండే నీటి సరఫరా, విద్యుద్దీపాలకు సంబంధించిన కార్మికులు సమ్మెలోకి వెళ్లకుండా హక్కులను సాధించు కునే విధంగా ప్రయత్నించాలి. లేనిపక్షంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని పరిస్థితి కార్మికుల వల్ల వచ్చే అవకాశం ఉంది.

\- రాజశేఖర్, నగర పాలక ఎస్ఈ

తిరుమలలో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి



ఆలయంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వేంకటేశ్వర స్వామిని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంక టేశ్వర్లు దర్శించుకున్నారు. మంగళవారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండా లని, అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడు కున్నట్లు పేర్కొన్నారు.

మెడికల్ బిల్లులు మంజూరు చేయాలి



డీఈవోను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ బిల్లులను జాప్యం లేకుండా మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్పీ కృష్ణారెడ్డి, కార్యదర్శి ధనుంజయ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాల యంలో డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను కలిసి వారు వినతి పత్రం అందజే శారు. అనంతరం పీఆర్‌టీయు నాయకులు డీఈవోకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎన్నికలు, వేసవి సెలవుల్లో పనిచేసిన వారికి ఆర్జిత సెలవులు నమోదుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం, పారితోషికం వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ వి.కరుణానిధిమూర్తి, నాయకులు బాబురావు, శ్రీనివా సరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినం క్యాంపెయిన్‌లో భాగంగా మరుగుదొడ్లను శుభ్రంగా నిర్వహించిన వారికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా పురస్కారాలు అందజేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హమారా శౌచాలయ్ - హమారా సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశుభ్రంగా నిర్వహించిన వారికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినాన్ని పురస్కరించుకుని నవంబరు 19 నుంచి డిసెంబరు 10 వరకు జిల్లా అంతటా హమారా సౌచాలయ్ - హమారా సమ్మాన్ పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి పది మందికి ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. వినియోగంలో లేని టాయిలెట్లను వినియోగంలోకి తెచ్చేలా అవగాహన కల్గించడం, నిర్వహణపై చైతన్యం తీసుకు రావడం, పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆసుపత్రుల్లో టాయిలెట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ట్యాంకుల్లో నీటిని పరిశీలించి, పారిశుధ్యంపై, బహిరంగ మలవిసర్జనపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అనంతరం గూడూరు మండలం జులేకల్ గ్రామానికి చెందిన జె.వెంకటమ్మ, కర్నూలు మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన రెడ్డిపోగు సోమన్న, వెల్దుర్తి మండలం బోగోలు గ్రామానికి చెందిన ఇ.లక్ష్మీదేవి, వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన పార్వతమ్మ, కల్లూరు మండలం తడకనపల్లెకు చెందిన షేక్ పర్వీన్, కల్లూరు మండలం పెద్దటేకూరు చెందిన కే.భక్షుబీ, గోనెగండ్ల గంజేమల్లికి చెందిన సి.మహేశ్వరి, తుగ్గలి మండలానికి చెందిన హరిజన రత్నమయ్య, కర్నూలు మండలం రేమటకు చెందిన ఎం.రత్నకర్, గోనెగండ్ల కర్నూర్ గ్రామానికి చెందిన కృష్ణవేణి (సర్పంచ్)లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో గుర్రాల భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌దొడ్డి, బ్రాహ్మ ణదొడ్డి గ్రామాలలో ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని దేవ దాయ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. గతంలో కొందరు బురాన్ దొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లోని మాన్యాన్ని ఆక్రమించుకోవడంతో గ్రామస్థులు అధికా రులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించారు.

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో స్కిన్ బ్యాంకు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో జీవన్‌దాన్ తరహా మాదిరిగా స్కిన్ బ్యాంకు ఏర్పాటు అనుమతులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.నరసింహం జారీ చేశారు. ఈ నెల డిసెంబరు 6న కాకినాడలో ఉమ్మడి రాష్ట్రాల ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల 21వ వార్షిక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సదస్సు కు కర్నూలు మెడదికల్ కాలేజీ ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.మంజుల బాయి, గెస్టు లెక్చరర్‌గా, చైర్ పర్సన్‌గా హాజరయ్యారు. పీజీ విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించింది. కర్నూలు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం రాష్ట్రంలోనే ఉత్తమ సేవలు అత్యధిక కేసులు చేసిన రికార్డు నెలకొల్పిందని డీఎంఈ డా.నరసింహం అభినందించారు. స్కిన్ బ్యాంకుకు కర్నూలు మెడి కల్ కాలేజీలో ఏర్పాటు చేసుకోవలని హెచ్‌వోడీ డా.మంజులబాయిని డీఎంఈ సూచించారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టినరసమ్మను కలిసి స్కిన్ బ్యాంకు వివరాలను డా.మంజులబాయి వివరించారు.

తవ్వారు సరే.. పూడ్చరా!



తుగ్గలి మండలంలో రాతన నుంచి జి.ఎర్రగుడి ప్రధాన రహదారిపై కేబుల్ వేయడానికి గుంతలు తీసి వదిలేశారు. వీటిని పూడ్చకుండా వదిలేయడంతో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు కేబుల్ వేసినవారికి, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో పలువురు గుంతలో పడుతున్నారని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.
- తుగ్గలి

ఎమ్మెల్యే చెప్పినా వినరా!



మద్దికెర బస్టాండు వద్ద రద్దీ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు విన్నవించారు. ఎమ్మెల్యే ట్రాన్స్‌ఫార్మన్‌ను తరలించాలని విద్యుత్ అధికారులకు సూచించినా వారు మార్చలేదు. పక్కనే జడ్పీ పాఠశాల ఉండంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఆదేశాలు వచ్చిన వెంటనే మారుస్తామని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ వివరణ ఇచ్చారు. -మద్దికెర

‘కూటమితో మారుతున్న పల్లెలు’

ఆస్పరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పల్లెల ముఖచిత్రాలు మారుతున్నాయని టీడీపీ బీసీ సెల్ సెక్రటరీ ఉచ్చిరప్ప యాదవ్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఆనతికాలంలోనే గ్రామాలలో మౌళిక వసతులు సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. ప్రధాన రహదారుల్లో గుంతులను పూడ్చుతున్నారన్నారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కృషితో నియోజకవర్గంలో ఆరు మండలాల్లో సీసీరోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. కరుణాకర్, శరథుడు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కార్యకర్తలు

ఆదోని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఆరెకల్లు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమెదు నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. రంగ స్వామి, రామస్వామి, మదిలే వీరేష్, రామకృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెగుళ్లను నివారించవచ్చు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శనగకు సోకిన తెగుళ్లను మందుల పిచికారీతో నివారించవచ్చని ఏవో రవి అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ‘శనగ రైతు దిగులు..’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని బురుజుల, ఎడవలి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. కాల్‌రాట్ తెగులు సోకి పంట ఎర్రబారి, కాండం చనిపోతుందన్నారు. దీని నివా రణకు ఎకరాకు 2 కేజీల ట్రైకోడ్రామనిరిడీ 2 కేజీల సుడోమోనో రెండు మందులు ఇసుకలో కలిపి పొలాల్లో చల్లితే తెగుళ్లను నివారిం చవచ్చన్నారు. కిలో రూ.100లు అవుతుందన్నారు. వ్యసాయాధికారుల సలహాల మేరకు మందులు వాడాలన్నారు.



శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో

రైల్వే పనులను అడ్డుకున్న గ్రామస్థులు



శ్మశాన స్థలం వివరాలు చూపుతున్న అధికారులు

హాలహర్వి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టిసాకిబండ గ్రామంలో శ్మశానంలో రైల్వే వంతెన వద్దని గ్రామస్థులు అడ్డుకున్నారు. మంగళవారం సర్పంచ్ ఒబులపతి ఆధ్వర్యంలో రైల్వే అధికారులతో వాగ్వావాదానికి దిగారు. సర్వే నెంబర్ 187/11ఎకరా 17సెంట్లు గ్రామ శ్మశానానికి కేటాయించారని, ఈ స్థలంలో పనులు చేస్తే తమ పరిస్థితి ఏంటని రైల్వే సీనియర్ ఇంజనీర్ రాంప్రసాద్‌తో వాదించారు. స్పందించిన ఆయన రైల్వే భూమిలో మాత్రమే పనులు చేస్తున్నామని చెప్పారు. పనులు ఆపకపోతే ఉరుకోమని గ్రామస్థులు గొడవకు దిగారు. వీఆర్వో పెద్దన్న జ్యోకం చేసుకుని రెండు రోజుల గడువు ఇస్తే రెవెన్యూ రికార్డులు ఇస్తామనడంతో వివాదం సద్దుమణిగింది.

రాజకీయాల్లో రాణించాలి: సోమిశెట్టి

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. మంగళవారం వెల్దుర్తికి వచ్చిన ఆయనకు టీవీఎస్ రమేశ్, డాక్టర్ రాంప్రసాద్, టీవీఎస్ సుధీంద్ర పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆర్యవైశులతో ముచ్చటించారు. టీడీపీలోకి రావాలని వారిని ఆహ్వానించారు. ఫణిరాజ్, లక్ష్మయ్య, నాగరాజుయాదవ్ ఉన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని ముక్కెల్లలో రెవెన్యూ సదస్సుల నిర్వహించారు. కోర్టుల్లో ఉన్న భూ సమస్యలు తీర్పు వచ్చేవరకు పరిష్కరించలేమన్నారు. డీటీ నాగరాజు, సర్పంచ్ సుజాత, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు రెహిమాన్, రంగప్ప, టీడీపీ నాయకులు రామచంద్ర, మునిస్వామి, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు నట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. మంగళవారం మొలగవల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ వివాదాలు, రికార్డులో తప్పులు లేకుండా రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. సర్పంచ్ మోహన్ రాజ్ ఆర్ఐ బసవన్న గౌడ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్‌వోలు రామంజనేయులు, డీలరులు అంజనేయ్య, వెంకటేశ్వరులు, వీరనాథ్ పాల్గొన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర

- ఆర్డీవో భరత్‌నాయక్
- పత్తికొండ టమోటా మార్కెట్ పరిశీలన



టమోటా రైతులతో ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టమోటాకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ధరలేని పక్షంలో ప్రభుత్వమే కొనుగోలుచేస్తుందని ఆర్డీవో భరత్‌నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌ను పరిశీలించారు. ఈఏడాది టమోటా ధరలు, విక్రయాల రికార్డులను పరిశీలించి, కార్యదర్శి కార్నలీస్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌శాఖ ఏడీఎం నారాయణమూర్తి, జిల్లా ఉద్యానవన అధికారి రామాంజేయులుతో కలసి టమోటా వేలాలను పరిశీలించారు. ధరలు, పెట్టుబడి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధర తగ్గితే, ప్రభుత్వమే కొనుగోలుచేసి రైతుబజార్లకు తరలిస్తుందని, ఇబ్బంది కలిగితే మార్కెట్‌శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలమేరకు మార్కెట్‌యార్డును పరిశీలించామన్నారు. టమోటాను వ్యాపారులు నాణ్యతను బట్టి కిలో రూ.6ల నుంచి, రూ.17ల వరకు కొనుగోలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. గిట్టుబాటు కంటే అధికంగానే ధరలు ఉన్నాయన్నారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వచ్చేనెల దుకాణాలను స్వాధీనం చేస్తాం: డీఎల్‌పీవో

ఆలూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంత మార్కెట్ దుకాణాలను దక్కించుకున్న వారికి వచ్చేనెల 1వ తేదీన దుకాణా లను స్వాధీనం చేస్తామని పత్తికొండ డివిజనల్ పంచా యతీ అధికారి వీరభద్రప్ప అన్నారు. మంగళవారం సంత మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలిం చారు. దుకాణాలను క్కించు కున్న వారు వచ్చేనెల 1వ తేదీ నాటికి మిగతా మొత్తం అద్దె చెల్లించా లన్నారు. అలా చెల్లించని పక్షంలో వారికి కేటాయించిన దుకాణాన్ని రద్దు చేస్తామని, డిపాజిట్ కూడా వెనక్కి ఇవ్వమన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని ఈవో ప్రభాకర్ రావ్‌ను పత్తికొండ డీఎల్‌పీవో ఆదేశించారు.



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

నూతన వంగడాలతో దిగుబడి



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన వంగడాలతో అధిక దిగుబడి సాధ్యమని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ కేశవమూర్తి అన్నారు. మంగళ వారం మదార్‌పురం గ్రామంలో రాజగోపాల్ పొలంలో సాగు చేసిన వేరుశనగ టీసీజీఎస్ 1,694 నూతన వంగడం పంటను పరిశీలించారు. అనంతరం వెల్దుర్తి రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విత్తనోత్పత్తి చేస్తే మార్కెట్ ధర కంటే 15శాతం ఎక్కుతో కొంటామని తెలిపారు. బ్రీడర్, ఫౌండేషన్ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏవో అక్బర్‌బాషా, మల్లిఖార్జున, శివ, చిన్నఇమామ్, జనార్ధన్, కలామ్, ప్రమీల, బందెనవాజ్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

దేవనకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులతోనే భూసమస్యలు పరిష్కారమవుతాయని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ అన్నారు. మండలంలోని జిల్లెలబుడకల గ్రామంలో రెవెన్యూ సదస్సులో 10 అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వ తప్పిదంతో రైతులు నష్టపోయారని, వాటిని రద్దుచేసి, రికార్డులు యధావిధిగా ఉండేలా చూస్తామన్నారు. తహసీల్దార్ లోకేశ్వరయ్య సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లెలబుడకలలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో, బొజ్జమ్మ

ప్రభుత్వ భూములను అక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ భూములను అక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. మంగళవారం దేవనకొండ క్రాస్ వద్ద వివాదస్పద భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రంతమైందన్న ఫిర్యాదు మేరకు సర్వే చేస్తున్నామన్నారు. తహసీల్దార్ లోకేశ్వరయ్య, డీటీ సుదర్శనం ఉన్నారు.

చుక్కలను తొలగించండి..

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల తప్పిదంతో తమ భూములకు చుక్కలు పడ్డాయని, తొలగించాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎడవలి గ్రామంలో సర్పంచ్ నంది కల్పన ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుశేన్‌సాహె బ్ పాల్గొన్నారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రామాంజులు, పంచాయితీ సలహాదారులు నంది జయరాముడు, రంగనాథ స్వామి, సిబ్బంది రఘు, కార్యదర్శి పరమేశ్వరప్ప ఉన్నారు.

గడువులోపు పరిష్కరిస్తాం

ఆదోని రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను గడువులోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మంగళవారం మదిరెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ నారాయణ, రీ సర్వే డీటీ పెద్దయ్య పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను తీర్చాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ఆదోని టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన కోర్కెలను తీర్చాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. కార్మిక నాయకులు అహ్మద్ హుసేన్, ఫీరా సాబ్, సోమన్న మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేవరు. తప్పని పరిస్థితులలో తాము రోడ్లపైకి రావాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించాలి. కృష్ణ మూర్తి, కరెన్న, కైలాష్, చంద్రపాషా సీపీఐ నాయకులు ఈరన్న, తిప్పన్న పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపేస్తాం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ విష్ణు

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేస్తామని ఏఈ విష్ణు, సురేష్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఎం.అగ్రహారం గ్రామంలో బస్టాండు వద్ద నుంచి మెయిన్ బజారు వరకు మొదటగా మూడు మీటర్లు వేశామని, ప్రజల సౌకర్యార్థం మరో మీటరు పెంచామన్నారు. అలాగే బురుజుల గ్రామంలో రూ.22 లక్షలతో పనులు పూర్తయ్యాయని తెలిపారు. పెరవలి గ్రామంలో ఇప్పటికే రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామ న్నారు. టీడీపీ నాయకులు చెన్నకేశవులు, కొత్తూరు శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు ఉన్నారు.

వంకలో చెత్త వేయొద్దు

ఆదోని టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దవంకలో చెత్తను పడేయొద్దని కమిషనర్ కృష్ణ ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన కొడల్ పేట మీదుగా వెళ్తున్న పెద్ద వంకను పరిశీలించారు. వంక, డ్రైనేజీలలో చెత్త వేయడంతో మురుగు రోడ్డుపైకి చేరే అవకాశ మువదన్నారు. పట్టణ ప్రజలు చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు.



పెద్ద వంకను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణ

‘టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి’

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం 9వ వార్డులో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రామచంద్ర నాయుడు, ఎర్రబ జారు, మున్వర్‌బాషా, సూరి, మహేష్ పాల్గొన్నారు.

అదానీ అక్రమాలపై విచారణ చేయాలి : సీపీఐ

పత్తికొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోళ్లలో పారిశ్రామికవేత్త అదాని అక్రమాలపై విచారణ చేయాలని సీపీఐ కార్యదర్శి రాజా సాహె బ్, నబీ రసూల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, నాలుగు స్థంభాల కూడలిలో ధర్నా చేశారు. విద్యుత్ ఒప్పందంలో నాటి సీఎం జగన్‌కు రూ.15.50 కోట్లు ముడుపులు అందాయన్న దానిపై పార్లమెంటు కమిటీచే విచారణ చేయాలన్నారు. ఆదాని వ్యవహారాలపై పెద్దఎత్తున దుమారం రేగుతున్నా మోదీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఇందుకు మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు తిమ్మయ్య, నెట్టికంటయ్య, కారన్న, సుంకన్న, కాశీ, గిడ్డయ్య, రాగప్ప పాల్గొన్నారు.

ఉపాధి పీడీకి ఫిర్యాదు

ఆదోని రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేకల్లు ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని కూలీలు ఉపాధి పీడీ వెంకట రమణయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ఏపీడీ క్లస్టర్, టెక్నికల్ అసిస్టెంట్ గిడ్డయ్య, సిబ్బంది ఉపాధి పనులను తనిఖీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ గిడ్డయ్య మాట్లాడుతూ, 91 మంది హాజరు ఉండగా, పనిలో 70మంది ఉన్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు

- నిరసన తెలిపిన బీజేపీ నాయకులు, రైతులు



అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

హొళగుంద, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని బీజేపీ కన్వీనర్ ఈడిగ ప్రసాద్, పెద్ద హ్యాట మల్లయ్య, రైతులు గాలెప్ప, పెద్ద లక్ష్మన్న మంగళవారం వాపోయారు. జిల్లా ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో రెవె న్యూ, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదన్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయితీలో విధులు నిర్వహించ కుండా మండల పరిషత్ కార్యాలయానికే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఎంపీడీవో, విజయ లలితను వివరణ కోరగా రాత్రి రెండు గంటల వరకు పంచాయితీ కార్యదార్శులు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇళ్ల వివరాలు నమోదు చేస్తున్నారని అందుకే ఆలస్యంగా వస్తున్నారని తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

హలహర్వి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ నజ్మాభాను అన్నారు. మంగళవారం బాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంపీటీసీ పద్మావతి, టీడీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఆస్పరి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఉత్సవాలను జయప్రదం చేయా లని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బీ గిడ్డయ్య అన్నారు. మంగళవారం మాట్లాడు తూ ఈనెల 26న నిర్వహించనున్నామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజలపై భారం మోపింద న్నారు. మండల కార్యదర్శి విరుపాక్షి, బడే సాబ్, రంగన్న, నల్లన్న, రంగన్న, హనుమంతు, రాజా, చంద్ర, పరమేష్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తుగ్గలి ఏవో పవన్ కుమార్



తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఈక్రాప్ నమోదు పూర్తయిందా?

జవాబు: ఖరీఫ్‌లో పూర్తి చేశాం. రబీ సీజన్‌లో ప్రారంభించాము. నమోదు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలను రక్షించుకునేందుకు రైతులకు సలహాలు ఇస్తున్నారా?

జవాబు: అకాల వర్షాలు, తుపానులు, ఈదురుగాలులు ప్రకృతి విపత్తులను తట్టుకునేందుకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

ప్రశ్న: బయో పురుగుమందులను కట్టడి చేస్తున్నారా?

జవాబు: మండలంలోని అన్ని ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. బయోమందులు ఉంటే దుకాణాలను సీజ్ చేస్తున్నాం. వీటిని వాడకూడదని రైతులకు సలహాలు ఇస్తున్నాము.

ప్రశ్న: సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారా?

జవాబు: ఏటా ఖరీఫ్, రబీలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచి, ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నాము.

ప్రశ్న: భూసార, పంటకోత ప్రయోగం చేస్తున్నారా?

జవాబు: ఏటా సాగు ముగిసిన వెంటనే భూసార పరీక్షలు చేస్తువము. దిగుబడి సమయంలో పంట కోత ప్రయోగం చేసి, నివేదిక ఇస్తున్నాం.

ప్రశ్న: పాడి రైతులు పశుగ్రాసం కొరత ఎలా అధిగమించాలి?

జవాబు: పశుగ్రాసం కొరత ఏర్పడినప్పుడు రైతులు దరఖాస్తు చేసుకుంటే నివేదకను ప్రభుత్వానికి అందించి వచ్చిన పశుగ్రాసాన్ని రైతులకు నేరుగా అందిస్తున్నాం.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


వగరూరులో మాట్లాడుతున్న ఏవో జీర గణేష్

మంత్రాలయం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. మంగళవారం వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాల్లో పత్తి, మిరప, వరి, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. రబీ పంటల్లో భాగంగా జొన్న, సజ్జ, శనగ, వేరుశనగ వంటి పంటలకు సోకే వైరస్, క్రిమికీటకాలకు వాడాల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయాధికారులు సూచనలు పాటించి అధిక దిగుబడి పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు విజయకుమార్, శ్రీనివాసులు, తిమ్మప్ప, కేశన్న, ఏసేబు, ఆదాం, ఖలీల్, దస్తగిరి, రంగన్న, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయం: ఎంఈవో

మంత్రాలయం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా పని చేయాలని ఎంఈవో రాగన్న అన్నారు. మంగళవారం చౌలహల్లి, సుంకేశ్వరి రచ్చుమర్రి, ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, పరిసరాల శుభ్రత, విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన తీరును పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆంగ్లం, గణితం, సైన్స్, హిందీ వంటి సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణా తరగతులు తీసుకోవాలన్నారు. ఇందు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎంలు మద్దిలేటి, రాజేష్‌గౌడు, ఈరన్న, హనుమంతు, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జగదీష్

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్ కైరవాడిలో ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సురేష్‌కుమార్, ఆరోగ్యభారతి ప్రాంతీయ కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం జగదీష్ మాట్లాడారు. శిబిరంలో 250మంది మహిళలకు, 160 మంది పురుషులకు 60 మంది చిన్నపిల్లలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో లోకేశ్వరరెడ్డి, జగదీష్, సత్యనారాయణ గుప్త, శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల కమిటీ చైర్మన్‌గా శేషప్పనాయుడు

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవాలయం, ఈశ్వర దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయాల కమిటీ చైర్మన్‌గా టీడీపీ నాయకుడు శేషప్పనాయుడిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా శిరీషా, తిక్కయ్య, కేశన్న, లక్ష్మీకాంతయ్యశెట్టిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శేషప్పనాయుడు మాట్లాడుతూ తనపై గ్రామ పెద్దలు పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వీరన్నగౌడ్, బసవరాజుస్వామి, మాజీ సర్పంచ్ వీరన్న, శిల్పిశ్రీనివాసులు, గొల్లరాముడు, రామాంజినేయులు, సోమన్న, నారాయణ, గోపాల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


విద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం లేకపోవడంతో జీవనం దుర్భరంగా మారిందని వాపోయారు. పీఎఫ్, ఈఎస్ఐలు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం మండల విద్యాధికారి ప్రతాప్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, నరసప్ప, ప్రతాప్, గణేష్, బాషా పాల్గొన్నారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చాకల వీధిలోని మదివేలప్ప ఆలయంలో మదిలేల మాచయ్య రజక సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా సీ రామన్న, అధ్యక్ష, కార్యదర్శులుగా బజారి, సీ నరేష్, కోశాధికారిగా ఈరన్నలను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, నరసన్న, సూరి, వీరేష్, పురుషోత్తం, శంకర్, పెద్దవీరేష్, రామాంజిని, భీమన్న, చిరంజీవి, వెంకటేష్, అంజినయ్య, రమేష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, రజకుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మంగళవారం ఆరవ రోజు సమ్మె కొనసాగించారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా శ్రీనివాస సర్కిల్ నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెకు కూర్చున్నారు. ఈ సమ్మెకు సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, కాంగ్రెస్ పట్టణ ఇన్‌చార్జి ఖాసీంవలి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజీ, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలు శిథిలం

నందవరం మండలంలోని పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. దీంతో చిన్నపాటి వర్షానికే ఆసుపత్రుల్లో ఉన్న మందులు, ఫైళ్లు తడిసిపోతున్నాయి. పైకప్పు పెచ్చులూడుతుండడంతో భయంభయంతో విధులు నిర్వర్తిస్తున్నామని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. భవనాలకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు విన్నవించినా పట్టించుకునే పాపాన పోలేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అలాగే మండలంలో ఐదు పశువైద్యశాలలు మాత్రమే ఉండడంతో పశువులకు సరైన వైద్యం అందడం లేదని రైతులు వాపోతున్నారు.


పెచ్చులూడిన ముగతి పశువైద్యశాల పైకప్పు

- పైపెచ్చులు ఊడుతున్న వైనం
- మరమ్మతులకు నోచుకోని భవనాలు
- భయాందోళనతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు


పెచ్చులూడిన పైకప్పు కింద విధులు నిర్వర్తిస్తున్న అధికారి

నందవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 గ్రామాలకు 5 పశువైద్యశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు మేకలు, గొర్రెలు 25 వేలు, పశువులు 8వేలు ఉన్నాయి. నందవరం పశువైద్యశాలకు 7 గ్రామాలు, నాగలదిన్నె పశువైద్యశాలకు 8 గ్రామాలు, కనకవీడుకు 2గ్రామాలు, ముగతికు 1 గ్రామం, హాలహర్వికు 5 గ్రామాలు ఉన్నాయి. అయితే మండలానికి ఐదు పశువైద్యశాలలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైన జబ్బు వస్తే ఐదారు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో భవనాలు

నందవరం మండలంలోని పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయోనని పశువైద్యాధికారులు బిక్కు..బిక్కు మంటు వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్నపాటి పైపెచ్చులు ఊడుతున్నాయి. అలాగే మందులు కూడా తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. మండలంలోని నాగలదిన్నె పశువైద్యశాల భవనం సిమెంట్ పెచ్చులు ఊడి మొత్తం కడ్డీలన్ని బయటకు తేలాయి. శిథిలమైయ్యింది. ముగతిలో పశువైద్యాధికారిపైనే పెచ్చులుడిన సంఘనలు ఉన్నాయి. కనకవీడు, ఇబ్రహింపురం గ్రామాల్లో కూడా పాత భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కనకవీడులో కనీసం భవన నిర్మాణానికి స్థలం కూడా కేటాయించలేదు. వైద్యశాలలో సరైన సౌకర్యాలు కూడా లేవని, మందులు కొరత కూడా వేదిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రతిపాదనలు పంపాం. కాని ఉన్నాధికారులు ఇంత వరకు నిధులు కేటాయించలేదు. త్వరగా నిధులు మంజురు చేస్తే బాగుంటుంది. అన్ని గ్రామాల్లో పశువైద్యశాలన్ని పూర్తిగా శిథిలమైయ్యాయి. పాత భవనాల్లోనే బిక్కు మంటు విధులు నిర్వహిస్తున్నాం.

- బన్ని హేమంత్‌కుమారు, పశువైద్యాధికారి

పశువైద్య కేంద్రం నిర్మించాలి



పొణకలదిన్నెలో పశువైద్యకేంద్రాన్ని నిర్మించాలి. గ్రామంలో అధికంగా పశువులతో పాటు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటికి రోగం వస్తే దాదాపు 4 కిలోమీటర్లు వెళ్లాల్సిందే. తనకు 300 పొట్టేళ్ల ఉన్నాయి. వాటి కోసం ఇతర గ్రామం నుంచి పశవైద్యులను తీసుకువచ్చి మందులు వేయించుకుంటున్నాను.

- వెంకటేశ్వర్లు, పొణకలదిన్నె గ్రామం

పశువైద్యశాల లేక ఇబ్బందులు



గంగవరంలో పశువైద్యశాల లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎద్దులకు, మూగజీవాలకు ఏ చిన్న జబ్బు వచ్చినా దాదాపు 8 కిలో మీటర్లు వెళ్లాలి. అక్కడ వైద్యులు ఉంటారో ఉండరో తెలియదు. వైద్యశాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు.

- ప్రహ్లాదరెడ్డి, గంగవరం


శిథిలావస్థలో నాగలదిన్నె పశువైద్య కేంద్రం


నందవరంలో బయటకు తేలిన కడ్డీలు

నాణ్యమైన భోజనం అందించాలి

నందవరం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని హలహర్వి గ్రామంలో పలు పాఠశాలను ఎంఈవో సుదర్శన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ సందీప్‌తో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం రుచి చూశారు. మెనూ పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే గ్రామంలో ప్రజలు ఇళ్ల ముంద మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

కోల్‌మాన్‌పేటలో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

కోసిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్ పేట గ్రామంలో మారెమ్మ దేవరను పురస్కరించుకొని డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు కృష్ణ, అంజి, సాయి, విష్ణులు తెలిపారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 11వ తేదీలోపు తమ టీం పేర్లను ప్రవేశ రుసుం రూ.800లు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఫైనల్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20వేలు ఉప్పలపాటి అర్జున్ బ్రదర్స్ వైష్ణవి అందజేస్తున్నారని అన్నారు. రెండో బహుమతి రూ.15వేలు కోసిగి మండల టీడీపీ కన్వీనర్ జ్ఞానేష్ ఇస్తారన్నారు. గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు టీడీపీ నాయకులు మదిరి పెద్దవీరారెడ్డి, క్రికెట్ కిట్లును కే.ఉశేనీ, కిరణ్, ఆనంద్, కాశీంలు అందజేస్తారన్నారు. పోటీలను మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ప్రారంభిస్తారని ఆర్గనైజర్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలపై సత్వర పరిష్కారం


సమావేశంలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

మంత్రాలయం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి విద్యుత్ అధికారులు ఎప్పుడూ ముందుంటారని ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, కర్నూలు ఎస్ఈ ఉమాపతి అన్నారు. మంగళవారం మంత్రాలయం విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌కో ఈఈ డీఎస్ విజయరాజు, మంత్రాలయం డీఈ విశ్వశాంతి స్వరూప్ అధ్యక్షతన ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, గూడూరు ప్రాంతాల్లోని రైతులు, గ్రామస్థుల నుంచి విద్యుత్‌పై ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. గృహాలు, ఫ్యాక్టరీలు, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా విద్యుత్ ఉత్పత్తికి ముందస్తు జాగ్రత్తలు చర్యలు చేసుకుంటోందన్నారు. విద్యుత్‌లో ఎటువంటి అవరోధాలు ఉన్నా రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు వంటివి కొరత ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. సమావేశంలో ఎమ్మిగనూరు డీఈ నాగేంద్ర ప్రసాద్, గూడూరు డీఈ జేసన్, ఏఈలు గోవిందు, సుబ్బారెడ్డి, నరసన్న, వీరేష్, ప్రసన్నకుమార్, గురుమూర్తి, నాగవేంద్రం, సుధాకర్, శ్రీనివాస్ నాయక్, మధుసూదన్, ఏవో మల్లికార్జున, చాంద్‌బాషా, రంగస్వామి, భీమయ్య, దివాకర్, వీరేష్ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

పెద్దకడబూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీల్లో పెద్దకడబూరులోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థిని లావణ్య ప్రతిభ చాటారు. విద్యార్థిని ఏకదాటిగా 47 శ్లోకాలను చెప్పి జిల్లాస్థాయిలో మూడవ బహుమతి పొందింది. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ గోవింద రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లయ్య, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

కౌతాళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు గ్రామసభలను సద్వినియోగం చేసుకొని, భూసమస్యలు పరిష్కరించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హల్వి గ్రామంలో తహసీల్దార్ మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల పొలాలను రీసర్వే చేయగా కొలతల్లో తేడాలు, పేర్లలో తప్పులు దొర్లినట్లు గుర్తించామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం గ్రామ సభల పేరిట అన్నదాతల వద్దకే అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రోజు ఒక గ్రామంలో సభ నిర్వహించి, అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలు జనవరి 8వరకు నిర్వహిస్తామన్నారు. భూసమస్యలపై అర్జీ పెట్టుకున్న ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, మండల సర్వేయర్ బసవరాజు స్వామి, వీఆర్వోలు సునీల్, నాగార్జున కూటమి ప్రభుత్వ నాయకులు ఉలిగయ్య, చిన్న సిద్ధయ్య, దర్గా మౌలా సోమనాథ్ గౌడ్, రైతులు ఉన్నారు.

మంత్రాలయం : గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో జరిగిన అవకతవకలపై దరఖాస్తులు చేసుకున్న ప్రతి రైతుకు న్యాయం చేస్తామని మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. మంగళవారం మండలంలోని బూదూరు గ్రామంలో వీఆర్వో భీమన్నగౌడు, ఆనంద్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో 13 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో ఆర్ఐ ఆదాం, సర్వేయర్ భీరప్ప, ఎర్రప్ప, నాగరాజు, రోగెప్ప, కప్పయ్య తదితరులున్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కడిమెట్ల గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరవుతున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కడిమెట్ల పంచాయతీలోని ఎర్రకోట, కడిమెట్ల, సిరాల దొడ్డి, రాళ్లదొడ్డి గ్రామాల్లోని రైతులకు ఏవైనా భూ సమస్యలు ఉంటే గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

నందవరం: రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని సోమలగూడురులో ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. దాదాపు 56 అర్జీల ను స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పార్థసారధిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, రజక సంఘం నాయకులు చంద్ర, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని స్థానిక కుర్ని కల్యాణ మండపంలో తహసీల్దార్ శేషాఫణి, సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషాఫణి మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సభల ఉద్దేశాన్ని వివరించారు. బాధితుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి వెంకటేష్, డిస్ట్రిక్ సెరికల్చర్, స్పెషల్ మండల అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలను 45రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. రైతుల నుంచి ఆరు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తేజశ్విని, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వీఆర్‌వో నారాయణ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్‌కీపర్ బొక్కేశాడు..!

- సభ్యులకు తెలియకుండా రూ.4 లక్షలు స్వాహా
- లబోదిబోమంటున్న పొదుపు మహిళలు


ఆవేదన వ్యక్తం చేస్తున్న చిన్నతుంభళం జైనాబీ గ్రూప్ సభ్యులు

పెద్దకడబూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు సభ్యుల సొమ్మును బుక్‌కీపర్ బొక్కే శాడు. సభ్యులకు తెలియకుండా రూ.4 లక్షలు స్వాహా చేశాడు. దీంతో గ్రూపు మహిళలు లబోదిబోమంటున్నారు. మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో ఓ బుక్ కీపర్ అవినీతికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదుపు మహిళల వివరాల మేరకు.. 12 మంది మహిళలు కలిసి 15 ఏళ్ల క్రితం జైనాబీ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. గ్రామా నికి చెందిన బుక్ కీపర్ 2022లో రూ.10 లక్షల గ్రూపు సభ్యులకు రుణం ఇప్పించాడు. డబ్బును సభ్యులు నెలనెలా చెల్లిస్తూ వచ్చా రు. అయితే పొదుపు మహిళలు ఇచ్చిన రూ.36 వేలను బ్యాంకుకు చెల్లించకుండా బుక్‌కీపర్ సొంత ఖర్చులకు వాడుకున్నాడు. సభ్యుల వేలిముద్రలు, సంతకాలు తీసుకొని వారి పేర్లపై 2024 మార్చిలో స్త్రీనిధి కింద రూ.3 లక్షలు లోన్ తీసుకొని కాజేశాడు. అలాగే మరో రూ.లక్ష గ్రామైఖ్య సంఘం నుంచి డ్రా చేసుకొని వాడుకున్నాడు. తీసుకున్న మొత్తాన్ని నాలుగు నెలలుగా చెల్లించక పోవడంతో గ్రూపు సభ్యులైన నూర్జాహాజన్, తిమ్మలమ్మ, లక్ష్మి, మున్నిబీల పేర్లపై అప్పు ఉందని బ్యాంకు, వెలుగు అధికారులు వారికి తెలిపారు. దీంతో ఖంగుతిన్న సభ్యులు బుక్‌కీపర్‌ను నిలదీశారు. తమ పేర్లపై వచ్చిన సొమ్ము ఏమైందని, ఎవరు తీసుకున్నారని నిలదీయగా తనకు తెలియ దని బుకాయిం చే ప్రయత్నం చేశాడు. అయితే మహిళలు అందరు కలిసి గ్రామ పెద్దల ముందు ఆధారాలతో చూపించడంతో తానే తప్పు చేశానని ఒప్పుకున్నాడు. డబ్బులను తిరిగి చెల్లిస్తానని చెప్పి కాలం వెళ్లదీస్తున్నాడు. అలాగే లోన్లు మంజూరైన ప్రతిసారి ఒక్కో గ్రూపు నుంచి ఐదారు వేల రూపాయల వరకు వసూలు చేస్తూ వస్తున్నా డని పొదుపు గ్రూపు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుక్ కీపర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీవో శ్రీనివాసులును వివరణ కోరగా ఈ విషయం వారం క్రితమే తమకు దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

బస్ షెల్టర్ ఉన్నా లేనట్టే!

- కనీస సౌకర్యాలు కరువు
- బస్ షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఇబ్బంది
- ఎండైనా.. వానైనా ప్రయాణికులు ఆరుబయటే
- కనిపించని మరుగుదొడ్లు



నిరుపయోగంగా గోనెగండ్ల బస్ షెల్టర్

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల ఆర్టీసీ బస్‌షెల్టర్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బస్ షెల్టర్‌లో ప్రయాణికులు కుర్చునేందుకు కూడా సరైన సౌకర్యాలు లేవు. ఆర్టీసీ సర్దుబాటు పేరుతో టికెట్ ధరలు పెంచుతున్నప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం వెనకబడిపోయింది. ప్రజలకు ఎండ వర్షంనుంచి రక్షణ కల్పించేందుకు బస్ షెల్టర్ ను నిర్మించారు. ఇక్కడ మౌలిక వసతులు లేక పోవడంతో నిరుపయోగంగా మారిపోయింది.

మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కరువు:

గోనెగండ్ల బస్ షెల్టర్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్డి లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు అవసరమైతే హోటల్ దగ్గరకు వెళ్లి తాగాల్సివస్తుంది. మరుగుదొడ్డి విషయంలో మహిళలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కనీసం అర కిలో మీటర్ వరకు ఎక్కడా మూత్రం విసర్జించేందేకు కూడా స్థలంలేదు.

- గోనెగండ్ల నుంచి కర్నూలు, హైదరాబాద్, బళ్లారి, రాయచూరు, మంత్రాలయం, బెంగుళూరు, నెల్లూరు, శ్రీశైలం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ప్రతి రోజులు బస్సులు వెళ్తుంటాయి. ఇక్కడి నుంచి ప్రతి దినం ప్రయాణికులు ఈ ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. మండంలోని ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, పెద్దమివీడు, చిన్నమరివీడు, అలువాల, కులుమాల, గుళ్లమోరుసు, గాజులదిన్నె, నెరుడుప్పల, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె గ్రామాలతో పాటుమరి కొన్ని గ్రామాలకు చెందిని ప్రజలు గోనెగండ్ల బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తారు. అయితే కనీస సౌకార్యలు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.


బస్సు కోసం రోడ్డు పై నిలబడిన ప్రయాణికులు

మరమ్మతులు చేపట్టాలి



45ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. అలాగే గోనెగండ్ల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు గాను ప్రతి దినం ఇతర గ్రామాలను నుంచి ప్రయాణికులు వెళ్తుతుంటారు. ప్రయాణికులు కుర్చునేందుక సీట్లు లేవు.

- మురళీనాయుడు, గోనెగండ్ల

మరుగుదొడ్లు నిర్మించాలి



మరుగుదొడ్లు లేక పోవడంతో మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగుదొడ్లను నిర్మించాలి.

- కరుణాకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు

తాగునీటి సౌకర్యం కల్పించాలి



బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు తాగేందుకు నీరు లేక పోవడంతో అక్కడ ఉన్న హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తుంది. లేక పోతే డబ్బులు పెట్టి నీటిని కొనాల్సివస్తుంది. నిరుపేదలు తీవ్ర ఇబ్బంది పాడుతున్నారు.

- కౌలుట్లయ్యనాయుడు, గోనెగండ్ల